సాక్షి నిజామాబాద్

ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



నాలుగు నెలల్లోనే..

రాష్ట్ర ప్రభుత్వంపై నాలుగు నెలల్లోనే వ్యతిరేకత పెరిగిందని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



దాతలు నిర్మిస్తున్న స్టేడియం

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు దాతల సహకారంతో ముప్కాల్‌లో ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.3 /23.2

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు న్నాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు అవసరం



సుభాష్‌నగర్: అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలు, పోస్టర్లను శనివారం కలెక్టరేట్‌లోని క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గోదాములు, షాపింగ్ మాల్‌లలో ప్రమాదాలు జరగకుండా యజమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లా అగ్నిమాపక కేంద్రం అధికారి మురళి మనోహర్ రెడ్డి, ఏడీఎఫ్ఓ భీమ్ ప్రణబ్, నర్సింగ్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలి



ధర్పల్లి: అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని హొన్నాజీపేటలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున లారీల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో జాప్యం జరుగుతుందని కొటాలపల్లి, నడిమి తండాకు చెందిన రైతులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. డీఎస్‌వో చంద్రప్రకాశ్, డీఎం జగదీశ్, డీఆర్‌డీవో సాయాగౌడ్, డీపీఎం సాయిలు, డీసీవో శ్రీనివాస్, తహసీల్దార్ మాలతి, ఎంపీడీవో బాలకృష్ణ, ఏవో ప్రవీణ్, ఏపీఎం సునీత పాల్గొన్నారు.

‘ఎన్నికల తర్వాత ప్రభుత్వంలో విలీనం’



కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగియగానే ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం కానుందని ఆర్టీసీ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యూయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు పేర్కొన్నారు. శనివారం కామారెడ్డిలోని రోటరీ క్లబ్‌లో ఆర్టీసీ కార్మికుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఆర్టీసీ విలీనంపై శుభవార్త చెప్పాలని కోరామన్నారు. ఎలక్షన్ కోడ్ ముగిసిన తర్వాత ప్రక్రియ పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కార్మికుల హక్కులను కాలరాశారని విమర్శించారు. అనంతరం యూనియన్ కామారెడ్డి డిపో అధ్యక్షుడిగా భాస్కర్‌గౌడ్, కార్యదర్శిగా రమేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహమూద్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ డీవీకే రావు, వైస్ చైర్మన్ జక్కుల మల్లేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనయ్య తదితరులు పాల్గొన్నారు.

‘కేటీఆర్ జైలుకెళ్లడం ఖాయం’

కామారెడ్డి టౌన్: గత ప్రభుత్వం చేసిన అవినీతి విషయంలో అప్పటి మంత్రి కేటీఆర్‌తో పాటు మరికొందరు బీఆర్ఎస్ నేతలు జైలుకెళ్లడం ఖాయమని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. శనివారం కామారెడ్డిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కవిత లిక్కర్ స్కామ్‌తోపాటు, బీఆర్ఎస్ హయాంలో జరిగిన కాళేశ్వరం ప్రాజెక్ట్, భూ కుంభకోణాలు, ఫోన్ ట్యాపింగ్, భూ కబ్జాలు తదితర అంశాల్లో ఆధారాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. గత ఎన్నికలలో పోలీస్ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పోలీసు వాహనాలలో బీఆర్ఎస్ నేతల డబ్బులు తరలించారని ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉండి రైతులను పట్టించుకోని సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఇప్పుడు మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని విమర్శించారు.

మిద్దె తోట.. ఆరోగ్య పంట

సండే స్పెషల్

ఇంట్లోనే అన్ని రకాల స్వచ్ఛమైన, సేంద్రియ కూరగాయలకు మిద్దె తోటలు కేరాఫ్‌గా మారుతున్నాయి. విచ్చలవిడిగా పురుగుల మందులు వాడి కూరగాయలు పండించడంతో ఆహారం విషతుల్యమవుతుంది. మనం ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారం తీసుకోవాలి. అందుకోసమే చాలా మంది తమ ఇంటి డాబాపై రసాయనాలు, పురుగుల మందులు వాడకుండా పండ్లు, కూరగాయలను పండిస్తున్నారు.



నగరంలోని నాందేవ్‌వాడలో సునీతా బహెన్ జీ ఇంటిపై మొక్కలు

- దాబాపై కూరగాయలు, పండ్ల సాగు
- ఆసక్తి చూపుతున్న నగరవాసులు
- సేంద్రియ పద్ధతిలో పండిస్తూ సత్ఫలితాలు

నిజామాబాద్ సిటీ: నగరవాసులు మిద్దె తోటలపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఆరోగ్యం కోసం సేంద్రియ ఎరువులు వినియోగించి ఇంట్లోకి అవసరమైన పండ్లు, కూరగాయలను దాబాపై పండిస్తున్నారు. కరోనాకు ముందు అక్కడక్కడ మాత్రమే కనిపించే మిద్దెతోటల సాగు ఇప్పుడు పెరిగింది. ఇంటిపై ఏమాత్రం స్థలం ఉన్న మొక్కలు పెంచుతున్నారు. మిద్దెపై సేంద్రియ ఎరువులతో రకరకాల పండ్లు, ఆకుకూరలు, కాయగూరలు సాగు చేస్తూ వాటిని తింటూ ఆరోగ్యాలను కాపాడుకుంటున్నారు. నగరంలోని నాందేవ్‌వాడ, సరస్వతినగర్, సుభాష్‌నగర్, గంగాస్థాన్ ఫేస్-1, 2, ఆర్యనగర్, బ్యాంక్‌కాలనీ, వినాయక్‌నగర్ ప్రాంతాలలో అనేకమంది మిద్దె తోటలు పెంచుతున్నారు.



పసుపు కొమ్ములు



టమాటలు



అరటి చెట్టు



వంకాయలు

ఇంట్లో వ్యర్థాలు సద్వినియోగం

మిద్దె తోటలు పెంచే వారు ఇంట్లో వ్యర్థాలతో ఎరువును తయారు చేస్తున్నారు. కూరగాయలు, ఆకు కూరలు, పండ్ల వ్యర్థాలు కళ్లబెట్టి వర్మి కంపోస్టు తయారు చేస్తున్నారు. వాటిని పూర్తిగా ఎండబెట్టి పౌడర్‌గా మార్చి మిద్దెపై సాగు చేసే మొక్కలకు వేస్తున్నారు. రసాయన ఎరువులు వాడకుండా వర్మి కంపోస్టుతో పంటలు సాగు చేసి ఆరోగ్యాలను కాపాడుకుంటున్నారు.



మిద్దెపై పండిన జామకాయను చూపుతున్న సౌందర్య

గోధుమ గడ్డితో మొదలై..



రాజమండ్రిలో నాకు తెలిసిన వారు మిద్దెపై పంటలు సాగు చేసేవారు. వారిని చూసి నేను కూడా మొదట గోధుమ గడ్డి పెంచాను. అది బాగా పెరగడంతో ఆసక్తి కలిగింది. అనంతరం అనేక మొక్కలు ఇంటిపై పెంచుతున్నా. వర్మి కంపోస్టు, జీవామృతం తయారు చేసి మొక్కలకు వేస్తున్నా. మా మిద్దె తోటలో అరటి, అంజీర్, దానిమ్మ, కూరగాయలు, ఔషధ మొక్కలు ఉన్నాయి. మొత్తం 420 రకాల మొక్కలు సాగు చేస్తున్నా. మా సెంటర్‌కు వచ్చిన అతిథులు 120 మందికి ఆక్సిజన్ మొక్కలు, 150 మందికి తులసీ మొక్కలు అందించా. మూడేళ్లుగా మార్కెట్‌కు వెళ్లకుండా మిద్దెపై పండిన కూరగాయలు, పండ్లు మాత్రమే వినియోగిస్తున్నా. – సునీతా బహెన్ జీ, నాందేవ్‌వాడ

25 ఏళ్లుగా సాగు చేస్తున్నా

వ్యవసాయంపై ఇష్టంతో మా మిద్దెపై 25 ఏళ్లుగా మొక్కలు సాగు చేస్తున్నా. సహజ సిద్ధమైన విధానాలను అనుసరిస్తూ మొక్కలు పెంచుతున్నా. మాకు ఆవులు ఉన్నాయి. ఆవు పేడతో కంపోస్ట్ ఎరువు తయారు చేసిన మొక్కలకు వేస్తున్నాం. మార్కెట్‌లో ఆర్గానిక్ పేరుతో కూరగాయలు అమ్ముతున్నా.. వాటిని పూర్తిగా నమ్మలేం. అదే సాగుచేసుకున్న కూరగాయలను నిర్భయంగా తినొచ్చు. మా ఇంటిపై అంజీర్, జామ, సపోటా, మామిడి, సీతాఫలం, అరటి పండ్ల, టమటా, వంకాయ, మిర్చి సాగు చేస్తున్నాం. ఇటీవలే ద్రాక్ష మొక్కలు పెట్టాం. – సౌందర్య, సరస్వతినగర్

ఒక్క అవిశ్వాసం.. మూడు పదవులకు ఎసరు

- క్లిష్ట సమస్యను ఎదుర్కోనున్న ఐడీసీఎంఎస్ చైర్మన్
- 19న నల్లవెల్లి సొసైటీలో అవిశ్వాస తీర్మాన సమావేశం
- పీఏసీఎస్, ఐడీసీఎంఎస్ చైర్మన్ సహా మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పదవులు కోల్పోనున్న సాంబారు మోహన్
- కొనసాగుతున్న నల్లవెల్లి సొసైటీ డైరెక్టర్ల క్యాంపు రాజకీయం



నల్లవెల్లి సొసైటీ కార్యాలయం



ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారు మోహన్

సుభాష్‌నగర్: ఇందల్వాయి మండలం నల్లవెల్లి సొసైటీ చైర్మన్ సాంబారు మోహన్‌పై డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాసం రసవత్తరంగా మారింది. సొసైటీ చైర్మన్‌గా మోహన్ ఎన్నికైన తర్వాత చోటుచేసుకున్న రాజకీయ సమీకరణల నేపథ్యంలో ఆయన ఏకంగా ఉమ్మడి జిల్లా ఐడీసీఎంఎస్ చైర్మన్, ఆ తర్వాత మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలు కాగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి సాంబారు మోహన్‌కు పదవీ గండం పట్టుకుంది. అనేక ఊగిసలాటల నడుమ ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న నల్లవెల్లి సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి తెరలేపారు. ఒక్క అవిశ్వాసంతో ఆయన మూడు పదవులు కోల్పోయే పరిస్థితి ఎదురవుతోంది.

ఇందూరు జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (ఐడీసీఎంఎస్) చైర్మన్‌గా నల్లవెల్లి సొసైటీ చైర్మన్ సాంబారు మోహన్ 2020 ఫిబ్రవరిలో ఎన్నికయ్యారు. ఇందులో మొత్తం 10 మంది డైరెక్టర్లు ఉంటారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 45 కొనుగోలు కేంద్రాలను ఐడీసీఎంఎస్ నిర్వహిస్తోంది. అలాగే ఆర్మూర్, బోధన్, కామారెడ్డి, ఇతర ప్రాంతాల్లో మడిగెల అద్దె ద్వారా సొసైటీకి ఆదాయం సమకూరుతోంది. మోహన్ బాధ్యతలు చేపట్టే నాటికి సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి నుంచి ప్రస్తుతం ఐడీసీఎంఎస్‌ను లాభాల బాట పట్టించారని సిబ్బంది పేర్కొంటున్నారు.

తీర్మానం నెగ్గేనా.. రాజీనామా చేస్తారా?

నల్లవెల్లి సొసైటీ చైర్మన్ సాంబారు మోహన్‌పై ఈనెల 19న అవిశ్వాస తీర్మాన సమావేశం ఏర్పాటు చేశారు. ఒకవేళ అవిశ్వాస తీర్మానం నెగ్గితే మోహన్ సొసైటీ చైర్మన్‌తోపాటు ఐడీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పదవులు కోల్పోనున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఏ చైర్మన్‌కు ఎదురుకాలేదని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, ఆయనపై అవిశ్వాసం పెడతారని ప్రచారం జరగడంతో ఆ పార్టీలో చేరేందుకు మోహన్ సిద్ధమయ్యారని తెలిసింది. అయితే అనివార్య కారణాలతో చేరిక వాయిదాపడింది. కాగా అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందా.. వీగిపోతుందా.. లేక అంతకుముందే మోహన్ రాజీనామా చేస్తారా అనేది రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

క్యాంపులో 9 మంది డైరెక్టర్లు

నల్లవెల్లి సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చినప్పటి నుంచి తొమ్మిది మంది డైరెక్టర్లు క్యాంపులోనే కొనసాగుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మోహన్‌ను పదవి నుంచి దించేయాలని స్థానిక డైరెక్టర్లతోపాటు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పట్టుబడుతున్నారు. మొదట ఐడీసీఎంఎస్‌లో అవిశ్వాస తీర్మానం పెట్టాలని భావించినప్పటికీ.. పరిస్థితులు అందుకు అనుకూలంగా లేవు. దీంతో నల్లవెల్లి సొసైటీలోని డైరెక్టర్లలో మోహన్‌పై ఉన్న అసమ్మతిని కాంగ్రెస్ అనుకూలంగా మార్చుకుని అవిశ్వాసానికి తెరలేపింది.

తదుపరి చైర్మన్ ఎవరో..

ఐడీసీఎంఎస్ చైర్మన్ మోహన్ పదవిని కోల్పోతే తదుపరి చైర్మన్ ఎవరనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఎన్నికలకు మరో 10 నెలలు మాత్రమే గడువుంది. అవిశ్వాసం నెగ్గి మోహన్ పదవి కోల్పోతే, వెంటనే ఇన్‌చార్జి చైర్మన్‌గా వైస్ చైర్మన్‌కు బాధ్యతలు అప్పగిస్తారు. ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా ఇంద్రసేనారెడ్డి (బీబీపేట్) ఉన్నారు. పూర్తి స్థాయి చైర్మన్‌కు ఆ తర్వాత నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది. ఈ క్రమంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ కోసం నిజామాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు డైరెక్టర్లు పోటీ పడుతున్నట్లు తెలిసింది. ఎన్‌డీసీసీబీ, ఐడీసీఎంఎస్ ఉమ్మడి జిల్లాల పరిధిలోకి వస్తాయి. ఒక జిల్లాకు డీసీసీబీ, మరో జిల్లాకు డీసీఎంఎస్ ఎన్నుకోవడం ఆనవాయితీ. ప్రస్తుతం డీసీసీబీ చైర్మన్‌గా నిజామాబాద్‌కు చెందిన కుంట రమేష్‌రెడ్డి ఉన్నారు. ఐడీసీఎంఎస్ కామారెడ్డి జిల్లాకు వదిలేస్తారా.. లేక ఇక్కడి నుంచే ఎన్నుకుంటారా అనేది వేచి చూడాల్సిన అంశం.

ఈత.. గుండెకోత







ఒడ్యాట్‌పల్లి చెరువులో పడి మృతి చెందిన యువకులు

- నీట మునిగి మృతి చెందుతున్న యువకులు

ఖలీల్‌వాడి: ఈత సరదా కన్నవారికి గుండెకోత మిగిలిస్తోంది. ఈత నేర్చుకోవడానికి చెరువులు, కాలువలు, గోదావరి పరీవాహక ప్రాంతాలకు వెళ్తున్న యువకులు, విద్యార్థులు లోతు తెలియక నీట మునిగి మృతి చెందుతున్నారు. మాక్లూర్ మండలం ఒడ్యాట్‌పల్లిలో శనివారం ఈతకు వెళ్లి ముగ్గురు యువకులు చనిపోయారు. వేసవిలో ఉక్కపోత నుంచి ఉపశమనానికి చాలా మంది ఈతకు వెళ్తారు. అయితే లోతు తెలియక నీట మునిగి మృతి చెందుతున్నారు.

ఇటీవల జరిగిన ఘటనలు

- మాక్లూర్ మండలం ఒడ్యాట్‌పల్లి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు శనివారం చెరువులోకి ఈతకు వెళ్లి మృతి చెందారు.
- సాలూర మండలం సాలూర క్యాంప్ చెరువు వద్ద ఇద్దరు డిగ్రీ విద్యార్థులు కలువ పువ్వుల కోసం వెళ్లి మృతి చెందారు.
- మార్చి 8న ఆఫంది ఫారం, చందూర్ గ్రామ శివారులోని నిజాంసాగర్ కాలువలో స్నానానికి వెళ్లిన ముగ్గురు వ్యక్తులు గల్లంతయ్యారు.
- మార్చి 8న మాక్లూర్ మండలం అడవిమామిడిపల్లి ఒడ్డెర కాలనీకి చెందిన మహేశ్, శ్రీనివాస్ మెండోరా మండలం పోచంపాడ్ వద్ద గంగస్నానానికి వెళ్లి చనిపోయారు.
- మార్చి 10న జక్రాన్‌పల్లి మండలం గన్యాతండాకు చెందిన ముగ్గురు విద్యార్థులు నీటి మునిగి చనిపోయారు. శివరాత్రి తర్వాత గోదావరిలో స్నానానికి వెళ్లి లక్ష్మి కాలువ హెడ్‌రెగ్యులేటర్ వద్ద నీట మునిగారు.

జాగ్రత్తలు పాటించాలి

- తల్లిదండ్రులు పిల్లలను లోతు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈతకు వెళ్లకుండా చూడాలి.
- చెరువులు, కాలువల వద్ద సెల్ఫీలు దిగొద్దు.
- చెరువుల్లో మొరం కోసం తవ్విన గుంతల వద్ద ఎక్కువ మంది చనిపోతున్నారు. ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
- కాలువల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు ఈతకు వెళ్లకూడదు.
- నైపుణ్యం గల శిక్షకుడి ఆధ్వర్యంలో ఈత నేర్చుకోవాలి.
- మద్యం మత్తులో ఈతకు వెళ్లొద్దు.
- నీటిలో సాహసాలు చేయొద్దు.

ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిపై హైకోర్టులో ప్రత్యర్థుల పిటిషన్లు

- అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపణలు

ఆర్మూర్: ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఎన్నికల నామినేషన్‌లో సమర్పించిన అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపిస్తూ ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో వీరు ముగ్గురు ప్రత్యర్థులుగా పోటీ పడగా రాకేశ్‌రెడ్డి విజయం సాధించిన విషయం విధితమే. కాగా ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన వ్యవసాయ క్షేత్రంలో నిర్మించిన గోదాము వివరాలు అఫిడవిట్‌లో పేర్కొనలేదంటూ వినయ్‌రెడ్డి వేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. మరో వైపు ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఉపయోగించిన ఐదు వాహనాలకు పోలీస్ శాఖ విధించిన చలాన్లు చెల్లించకుండా ఎన్నికల్లో ఆ వాహనాలను వినియోగించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి వేసిన పిటిషన్‌లో రాకేశ్‌రెడ్డిపై గతంలో ఉన్న పోలీసు కేసుల విషయాన్ని అఫిడవిట్‌లో పూర్తి స్థాయిలో పొందుపర్చలేదని ఆరోపించారని సమాచారం. రాకేశ్‌రెడ్డిపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ఇద్దరు ప్రత్యర్థులు ఏకకాలంలో హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

తడిసి ముద్దయిన ధాన్యం

- వడ్లు ఆరబెట్టుకునేందుకు కర్షకుల తిప్పలు
- ఇంకా పంట కోయని రైతుల్లో ఆందోళన



నికాల్‌పూర్‌లో తడిసిన ధాన్యం కుప్పలు



డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లిలో వర్షానికి తడిసిన వడ్లను నేర్పుతున్న రైతులు

డొంకేశ్వర్(ఆర్మూర్): పంటలపై ప్రకృతి పగబట్టింది. వారం క్రితమే బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల్లో కురిసిన వడగళ్లకు 1,641 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. దీని నుంచి కోలుకోకముందే శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం 10 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా కురిసిన అకాల వర్షానికి కల్లాలు, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. చాలమంది రైతులు కుప్పలపై టార్పాలిన్లు కప్పి ఉంచినప్పటికీ వర్షపు నీరు లోపలికి వచ్చి చేరింది. టార్పాలిన్లు కప్పని ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. పలు చోట్ల వర్షపు నీటికి వడ్లు కొట్టుకుపోయాయి. చేతికిందిన పంటను అమ్ముకునే సమయంలో వర్షం దెబ్బతీయడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. యాసంగి సీజన్‌కు జిల్లాలో 4.13 లక్షల ఎకరాల్లో వరిపంట సాగైంది. యాభై శాతానికి పైగా సన్నాలే ఉండడంతో ఇప్పటి వరకు రెండున్నర లక్షల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ఆలస్యంగా సాగు చేసిన పంట ఇప్పుడిప్పుడే కోత దశకు చేరుకుంటోంది. కోసిన పంటను కల్లాలు, రోడ్లపై రైతులు ఆరబెడుతున్నారు. వారం రోజులుగా ప్రతికూల వాతావరణం ఏర్పడి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచుతున్నారు. ఏ రాత్రి ఎప్పుడు వాన పడుతుందో తెలియక భయంతో టార్పాలిన్లు తీయడం లేదు. శనివారం ఉదయం వరకు కురిసిన వానకు జిల్లా అంతటా వడ్లు తడిశాయి. తడిసిన ధాన్యాన్ని తరబెట్టుకోవడానికి రైతులు తిప్పలు పడ్డారు. ఇంకా దాదాపు 40 శాతం వరకు పంట కోయాల్సి ఉంది. ఈదురుగాలులు, వడగళ్లు పడితే పంటకు భారీ నష్టం వాటిల్లేది. వర్షం మాత్రమే కురవడంతో వరి గింజలు పొలాల్లో నేలరాలలేదు. ఈ అకాల వర్షాలను చూసి పంట కోయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా నీరందక ఎండుతున్న వరి పంటను ఈ వర్షం గట్టెక్కించిందని చెప్పవచ్చు. సజ్జ, నువ్వు పంటలకు కూడా మేలు జరిగింది. అకాల వర్షానికి జిల్లాలో పంటలకు ఏమైనా నష్టం జరిగిందా అని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ మండల, గ్రామీణా వ్యవసాయాధికారులతో జూమ్ మీటింగ్‌లో సమీక్షించి పరిస్థితి తెలుసుకున్నారు.

నిలిచిన వరి కోతలు



నికాల్‌పూర్‌లో నిలిపి ఉంచిన కోత యంత్రాలు

డొంకేశ్వర్(ఆర్మూర్): అకాల వర్షాలకు జిల్లా వ్యాప్తంగా వరి కోతలకు బ్రేక్ పడింది. శనివారం ఉదయం వరకు ఆగకుండా కురిసిన వర్షానికి పొలాల నేల మెత్తగా మారిపోయింది. దీంతో కోత యంత్రాలు పొలాల్లోకి వెళ్లడానికి సాధ్యం కాలేదు. పంట కోతకు రావాలని రైతులు చెప్పినా కూడా వాహనాలు దిగబడిపోతాయనే భయంతో యజమానులు ముందుకు రాలేదు. కోత యంత్రాలను ఖాళీగానే ఉంచారు. నేల ఎండే వరకు టైర్లతో నడిచే వాహనాలు పంటను కోయడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో చైన్ యంత్రాలను రైతులు ఆశ్రయిస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ఇందల్వాయి: రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. మండలంలోని ఇందల్వాయి, తిర్మన్‌పల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఆయన శనివారం తనిఖీ చేసి అధికారులు, రైతులతో మాట్లాడారు. జిల్లాలో 466 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గన్ని బస్తాలు అందుబాటులో ఉండాలని, తూకం వేసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగినా, తరుగు తీసినా ఫిర్యాదు చేయాలని సూచించారు. రైతులు ధాన్యం తడవకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీసీవో శ్రీనివాస్ రావు, డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లై ఎస్‌డీఎం జగదీశ్, సీఈవో రతన్, చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఏవో ప్రవీణ్ ఉన్నారు.



ఇందల్వాయిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

క్లుప్తంగా

తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటి మట్టం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో నీటి మట్టం వేగంగా తగ్గుతోంది. కాకతీయ కాలువ ద్వారా 4,500 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 272 క్యూసెక్కుల నీరు పోతోందని, తాగునీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా, శనివారం సాయంత్రానికి 1058.40(12 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

సైనిక్ పాఠశాలకు రాజంపేట విద్యార్థి


శ్రీ మిథున్

రాజంపేట : కేంద్ర ప్రభుత్వ విద్య మంత్రిత్వశాఖ నిర్వహించిన(2024) సైనిక్ స్కూల్ ఎంట్రన్స్‌లో (ఆరోతరగతి లో ప్రవేశానికి) రాజంపేటకు చెందిన విద్యార్థి పటేల్ శ్రీ మిథున్ అర్హత సాధించాడు. జాతీయస్థాయిలో నిర్వహించిన పరీక్షలో 300 మార్కులకు గాను 260 మార్కులు సాధించి వికాస్ సైనిక్ స్కూల్‌కి ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తండ్రి పటేల్ అనిల్ ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నాడు.

కొనసాగుతున్న కబడ్డీ క్రీడా పోటీలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పార్లమెంట్‌స్థాయి కబడ్డీ క్రీడాపోటీలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని మహవీర్ సేన ఆధ్వర్యంలో నిర్వహించే ఈ క్రీడాపోటీలకు జహీరాబాద్ పార్లమెంట్‌లోని గ్రామాలకు చెందిన 55 టీంలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా క్రీడల నిర్వాహకుడు బంగ్లా చైతన్య గౌడ్ మాట్లాడుతూ ఈ క్రీడలు ఆదివారం రోజున ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రమేశ్ రెడ్డి, ప్రీతం, పీఈటీలు తదితరులున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి సన్మానం



బాన్సువాడ రూరల్ : సీఎం రేవంత్‌రెడ్డిని రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీయల్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం సీఎంకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ విజయం కోసం కృషి చేస్తున్నామన్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. నాయకులు అబ్దుల్ ఖాలేక్, కొట్టం మనోహర్, గంధం పవన్‌కుమార్, బర్ల మధుకర్ తదితరులు ఉన్నారు.

దాతలు నిర్మిస్తున్న స్టేడియం

- విరాళాలతో ముప్కాల్‌లో ఇండోర్ స్టేడియం నిర్మాణం
- రూ.27లక్షల అంచనా వ్యయంతో పనులు


ముప్కాల్‌లో కొనసాగుతున్న ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు

బాల్కొండ: క్రీడాకారుల పుట్టినిల్లుగా గుర్తింపు పొందిన ముప్కాల్‌లో దాతల సహకారంతో ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మండల కేంద్రానికి చెందిన క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. కొన్నేళ్లుగా జిల్లా, రాష్ట్రస్థాయి కబడ్డీ జట్ల శిక్షణ శిబిరాలను ముప్కాల్‌లో నిర్వహించారు. ఈ నేపథ్యంలో క్రీడాకారులను మరింత ప్రోత్సహించాలనే సంకల్పంతో స్టేడియం నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇందుకోసం మండల కేంద్రానికి చెందిన పలువురు కమిటీగా ఏర్పడి పనులను పర్యవేక్షిస్తున్నారు. గ్రామానికి చెందిన దాతలు రూ.50వేలకు తగ్గకుండా విరాళాలు అందించడంతో పనులు కొనసాగుతున్నాయి. విరాళాలు అందనికొలది పనులను ముందుకు తీసుకెళ్తున్నారు.

త్వరలో ముప్కాల్ అకాడమీ

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు త్వరలోనే ముప్కాల్ క్రీడా అకాడమీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మాజీ క్రీడాకారులు తెలిపారు. అన్ని అంశాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టోర్నీలు నిర్వహిస్తామంటున్నారు. ముప్కాల్‌లో ఇప్పటికే కబడ్డీ, టెన్నిస్‌బాల్, బ్యాడ్మింటన్ అసోసియేషన్‌లు ఉన్నాయి. ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తయిన వెంటనే టోర్నీలు నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తామని మాజీ క్రీడాకారులు అంటున్నారు.

ప్రభుత్వ సహకారం ఉండిఉంటే..

గత ప్రభుత్వం లేదా ప్రస్తుత ప్రభుత్వం సహకారం ఉండి ఉంటే ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తయ్యేవి. అయితే, పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. బాల్కొండ మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మిస్తామని ప్రకటించి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు పత్తా లేదు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా పాలకులు స్పందించి తమను ప్రోత్సహించేందుకు ముందుకు రావాలని క్రీడాకారులు కోరుతున్నారు.

దాతలు ముందుకు వస్తున్నారు



గ్రామంలో ఇండోర్ స్టేడియం నిర్మించాలని అనుకున్నాం. ఇందుకోసం కమిటీ ఏర్పడి, ముందుగా మేమే విరాళాలు అందించాం. ఆ తరువాత దాతలు వస్తున్నారు. మరికొంత మంది వస్తారని ఆశిస్తున్నాం. క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

– కబడ్డీ గంగాధర్, నిర్మాణ కమిటీ సభ్యుడు

క్రీడలను ప్రోత్సహించాలి..



చదువుతోపాటు క్రీడలు కూడ ముఖ్యం. క్రీడలను ప్రభుత్వాలు పోత్రహ్సించాలి. ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం దాతలు ముందుకు రావడం సంతోషకరం. ప్రభుత్వ ప్రోత్సహం ఉంటే మరింత బాగుండేది. దాతల సహకారంతో పనులు పూర్తి చేస్తాం.

– అంజయ్య, నిర్మాణ కమిటీ సభ్యుడు

నాలుగు నెలల్లోనే కాంగ్రెస్‌పై వ్యతిరేకత


మాట్లాడుతున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- బూటకపు హామీలతో ప్రజలకు మోసం
- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ఎల్లారెడ్డి/నిజాంసాగర్ : అధికారం చేపట్టిన నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, నిజాంసాగర్‌లోని మహమ్మద్‌నగర్ మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమలు సాధ్యంకాని హామీలిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. పాలిచ్చే బర్రెను వదులుకుని గొడ్డు బర్రెను అక్కున చేర్చుకున్న పరిస్థితి దాపురమైందన్నారు. అధికారంలోకి వచ్చి 135 రోజులవుతున్నా హామీలు నెరవేర్చలేదన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని మోసం చేశారన్నారు. 2 కోట్ల ఉద్యోగాలిస్తామని హామీలిచ్చి భర్తీ చేయలేదన్నారు. రాముడి పేరుతో ఓట్లు అడిగే పరిస్థితి బీజేపీ చేస్తుందన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. పదేళ్లు ఎంపీగా ఉన్న బీబీ పాటిల్ ఎలాంటి అభివృద్ధి చేయకుండా తన వ్యాపారాల కోసం బీజేపీలో చేరారన్నారు. జుక్కల్, బాన్సువాడ మీదుగా బీదర్ వరకు రైల్వేలైన్ తీసుకు వస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని మాటిచ్చి తప్పారన్నారు. ఎంపీ ఎన్నికలలో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. మహమ్మద్ నగర్ మండల కేంద్రానికి చెందిన యువకులతో పాటు నర్వ గ్రామానికి చెందిన రాజేశ్‌యాదవ్ బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే, మాజీ జెడ్పీచైర్మన్ దఫేదార్ రాజు, మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఎల్లారెడ్డి, వెల్లుట్ల సొసైటీ చైర్మన్లు నర్సింలు, సాయిలు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు ప్రతాప్‌రెడ్డి, సాయిరెడ్డి, బీఆర్‌ఎస్ ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండల పార్టీ అధ్యక్షులు జలందర్‌రెడ్డి, సిద్దయ్య, పట్టణ పార్టీ అధ్యక్షులు సతీష్ తదితరులు పాల్గొన్నారు

చిరువ్యాపారులకు చేయూత

ఆర్మూర్: చిరు వ్యాపారులకు బ్యాంకు రుణాలు ఇప్పించి చేయూతనందిస్తున్న ఘనత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకే దక్కిందని ఎంపీ, బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. పట్టణంలోని మామిడిపల్లి రైల్వే బ్రిడ్జి సమీపంలో శనివారం చాయ్‌పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతులు, యువతతో పలు అంశాలపై చర్చించారు. కుల సంఘ భవనాల నిర్మాణాలకు నిధుల కేటాయింపు లేకపోవడంతో పనులు మధ్యలో నిలిచిపోయాయని పలువురు తెలిపారు. ఎన్నికల అనంతరం ఎమ్మెల్యే ఫండ్ నుంచి నిధుల కేటాయించేలా చూస్తానని హామీ ఇచ్చారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు ఆర్థికసాయం అందిస్తోందన్నారు. గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త రేషన్ కార్డులు, పట్టాపాస్‌పుస్తకాలు ఇవ్వని కారణంగా కొందరికి కిసాన్ సమ్మాన్ డబ్బులు అందడం లేదన్నారు. స్థానిక సమస్యలను తెలుసుకునేందుకు చాయ్‌పే చర్చ వంటి కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

దళారులను నమ్మి మోసపోవద్దు


రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

సాక్షి ఎఫెక్ట్..

- ప్రైవేటు వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలి
- అదనపు కలెక్టర్ చంద్ర మోహన్

నస్రుల్లాబాద్(బాన్సువాడ): 'ధాన్యం దళారుల పాలు' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో అధికార యంత్రాంగం కదిలింది. నస్రుల్లాబాద్ మండలం మిర్జాపూర్, దుర్కి గ్రామాల్లో రైతులతో అదనపు కలెక్టర్ చంద్రమోహన్ శనివారం మాట్లాడారు. అకాల వర్షం కారణంగా ధాన్యం తడుస్తుండడంతో మిర్జాపూర్ నుంచి 2వేల బస్తాలు, దుర్కి నుంచి 514 బస్తాలను రైస్‌మిల్లులకు తరలించారు. మిగతా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. పీఏసీఎస్‌ల సీఈవోలు, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు, రైతులతో చర్చించారు. బీర్కూర్ మండలానికి చెందిన కొంత మంది పెద్ద రైతులు జీకే విత్తనాలను పండించారని, ఎంఎస్‌పీ ధరకన్నా ఎక్కువ ధరకు కొందరు విక్రయిస్తుండగా, మరి కొందరు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నారని పలువురు రైతులు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. బహిరంగ మార్కెట్‌లో విక్రయించొద్దని, డబ్బులు మోసపోయే అవకాశం ఉందన్నారు. త్వరగా కాంటాలు పెట్టాలని సీఈవోలకు సూచించారు. ఆయన వెంట డీసీఎస్‌వో మల్లికార్జునబాబు, సీఈవోలు, రైతులు ఉన్నారు.

తర్బుజాపై అంబేడ్కర్ చిత్రం




నగరంలోని పోచమ్మగల్లీకి చెందిన ఎడ్ల రుషికేశ్ తర్బుజా(పుచ్చకాయ)పై అంబేడ్కర్ చిత్రాన్ని వేశారు. ఆయన గతంలో చాక్‌పీస్, ఎల్ఈడీ బల్బు, తమలపాకు, మామిడి కాయపై అంబేడ్కర్ చిత్రాలువేసి అబ్బురపరిచారు. – నిజామాబాద్‌నాగారం

ఇతర రాష్ట్రాల మద్యం పట్టివేత



ఖలీల్‌వాడి: నందిపేట్ మండలం అయిలాపూర్ గ్రామంలో ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్ తెలిపారు. మద్యం నిల్వ ఉంచిన ఒకరితోపాటు సరఫరా చేసిన మరొకరిపై కేసు నమోదు చేశామన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. అయిలాపూర్ గ్రామానికి చెందిన ఉప్పరి అనిల్‌కుమార్ ఇంట్లో తనిఖీ చేయగా, గోవా రాష్ట్రానికి చెందిన 2 లీటర్ల బ్లెండర్ స్ప్రైడ్, మధ్యప్రదేశ్‌కి చెందిన 180 ఎంఎల్ 35ఎంసీ విస్కీ, ఎన్‌డీపీఎల్ 10.3 లీటర్లు, తెలంగాణాకి చెందిన 5.23 లీటర్ల మద్యం పట్టుబడింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఎంసీ లిక్కర్‌ను బాసరకు చెందిన అంబకంటి రాజును సరఫరా చేసినట్లు గుర్తించారు. మద్యం నిల్వ చేసిన అనిల్‌తోపాటు సరఫరా చేసిన రాజుపై కేసు నమోదు చేశారు. అక్రమంగా మద్యం విక్రయించనా, ఇతర రాష్ట్రాల మద్యం సరఫరా చేసినా ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో (87126 58973), ఎక్సైజ్ టోల్ ఫ్రీ నంబర్ 18004252523కు సమాచారం అందించాలని ఎస్‌హెచ్‌వో దిలీప్ కోరారు.

పెళ్లి చేసుకొని మోసం చేశాడు


భర్తతో కలిసి ఉన్న ఫొటో చూపుతున్న బాధితురాలు

నిజామాబాద్‌నాగారం: తనను గ్రామానికి చెందిన దీపక్ ప్రేమ పెళ్లి చేసుకొని మోసం చేశాడని నిజామాబాద్ రూరల్ మండలం ఆకుల కొండూర్‌కు చెందిన మాదస్తు విఘ్నేశ్వరి తెలిపింది. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఆమె వివరాలను వెల్లడించింది. గ్రామానికి చెందిన దీపక్, తాను ప్రేమించుకున్నామని, హైదరాబాద్‌లో పనిచేస్తున్న తన వద్దకు వచ్చి ఉద్యోగంలో చేరాడని విఘ్నేశ్వరి తెలిపింది. దీపక్ తన అక్కాబావల వద్దకు తనను తీసుకెళ్లి తామిద్దరం ప్రేమించుకుంటున్నామని, పెళ్లికి అమ్మానాన్నలను ఒప్పించాలని కోరాడని, వారు అభ్యంతరం చెప్పకపోవడంతో దీపక్‌ను తాను పూర్తిగా నమ్మానని పేర్కొంది. 2023 అక్టోబర్ 17న హైదరాబాద్‌లోని బల్కంపేట్ ఎల్లమ్మ ఆలయంలో పెళ్లి చేసుకున్నామని తెలిపింది. తాను గర్భం దాల్చగా, 2024 జనవరి 5న మాయమాటలు చెప్పి అబార్షన్ చేయించాడని, మార్చి 20 వరకు తనతో ఉన్న దీపక్‌ను వాళ్ల అక్క, తాత, బాబాయ్ వచ్చి తీసుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈనెల 2వ తేదీన తాను రూరల్‌పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదని, తన భర్తను తనకు అప్పగించాలని కోరింది. సమావేశంలో ఐద్వా అధ్యక్షురాలు సబ్బని లత తదితరులు పాల్గొన్నారు.

నల్లమట్టితో నానా అవస్థలు


నందిపేట - కుద్వాన్‌పూర్ రోడ్డుపై నల్లమట్టి


రోడ్డుపై ఏర్పడిన గుంత

- బురదమయమైన రోడ్లు
- అదుపుతప్పుతున్న వాహనాలు

నందిపేట్(ఆర్మూర్): టిప్పర్లలో నుంచి పడిన నల్లమట్టి కారణంగా రోడ్లు బురదమయమయ్యాయి. గోదావరిలో నుంచి నల్లమట్టిని లోడ్ చేసుకొని మండలంలోని కుద్వాన్‌పూర్ గ్రామం రోడ్డు మీదుగా ఓవర్‌లోడ్‌తో టిప్పర్లు వెళ్తున్నాయి.

నందిపేట, ఆర్మూర్, జక్రాన్‌పల్లి, బాల్కొండ మండలాలకు ప్రతిరోజూ వందలాది టిప్పర్లలో నల్లమట్టిని తరలిస్తున్నారు. రోడ్లపై మట్టి పెల్లలు పడగా, రెండురోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా బురద అయ్యింది. దీంతో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి వాహనదారులు ప్రమాదాలబారినపడుతున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి వేసిన రోడ్లు ధ్వంసమవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

లారీని ఢీకొట్టిన బొలెరో.. ఒకరి మృతి

ఇందల్వాయి: లారీని బొలెరో ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలైనట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. శుక్రవారం రాత్రి 44వ నంబర్ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

ఎల్లారెడ్డి పల్లె గ్రామ శివారులోని స్టోన్ క్రషర్‌లో పని చేస్తున్న నరేందర్, ఆశిష్, బబ్లూ డీజిల్ తెచ్చేందుకు బొలెరోలో పెట్రోల్‌బంక్‌కు బయల్దేరారు. ఈక్రమంలో గంగారాం తండా వద్ద ముందున్న లారీని బొలెరో వేగంగా ఢీకొట్టింది. మధ్యప్రదేశ్‌కు చెందిన బబ్లూ(45) ఘటనాస్థలంలోనే మృతి చెందగా, నరేందర్, ఆశిష్‌కు గాయాలయ్యాయి. క్రషర్‌కార్మికుడు సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలోని మాధవనగర్ వద్ద రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి(50) ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. మృతుడి ఒంటిపై గులాబీరంగు ఫుల్ షర్ట్, నలుపు గీతల లుంగీ ఉందన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, పూర్తి వివరాలకు 87126 58591 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో మేకలు మృతి

వర్ని: మండలంలోని కూనీపూర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మూడు మేకలు మృత్యువాతపడ్డాయి. ప్యాట్ల కిష్టయ్యకు చెందిన మేకల మంద శనివారం విద్యుత్‌స్తంభం పక్కనుంచి వెళ్తున్న సమయంలో షార్ట్‌సర్క్యూట్ కావడంతో మేకలు మృతి చెందాయి. మృతి చెందిన మేకల విలువ సుమారు రూ.30వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

ఆత్మకూర్‌లో గేదె..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలం ఆత్మకూర్‌లో విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందినట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. మేతకు వెళ్లిన రాజేశ్వర్‌రెడ్డికి చెందిన గేదె గ్రామ శివారులోని 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతి చెందిందన్నారు. రూ.50 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని కోరాడు.

రేషన్ బియ్యం పట్టివేత



భిక్కనూరు: అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామ శివారులో పట్టుకున్నట్టు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పోతారం గ్రామానికి చెందిన రాజశేఖర్ వ్యాన్‌లో 15 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు శనివారం వాహనాన్ని తనిఖీ చేసి పట్టుకున్నామన్నారు. బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్యకు అప్పగించామన్నారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.


వృద్ధురాలి అదృశ్యం



జక్రాన్‌పల్లి: మండలంలోని బాలానగర్‌కు చెందిన గుంజేటి చిన్నక్క (63) ఈ నెల 12న అదృశ్యమైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కొడుకుతో గొడవపడిన చిన్నక్క ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయిందన్నారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో కొడుకు వెంకటి ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. చిన్నక్క ఆచూకీ తెలిసిన వారు 87126 59853 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

పంపుసెట్ మోటార్ల చోరీ

- వారం రోజుల్లో రెండు ఘటనలు
- ఆందోళనకు గురవుతున్న రైతులు


రెంజర్లలో పంపుసెట్ ఎత్తుకుపోవడంతో మిగిలిన పైపు

బాల్కొండ: పంటలకు నీరందించేందుకు రైతులు ఏర్పాటు చేస్తున్న పంపుసెట్ మోటార్లు చోరీకి గురవుతున్నాయి. దుండగులు మోటార్లే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్నారు. ముప్కాల్ మండలం రెంజర్లలో వారం రోజుల వ్యవధిలో రెండు మోటార్లను దుండగులు ఎత్తుకెళ్లడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దొంగలు గతంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేసే కాకతీయ కాలువలో ఏర్పాటు చేసిన పంపుసెట్‌లను టార్గెట్ చేయగా, ఇప్పుడు కాలువలతో పాటు ఊటబావులకు అమర్చిన మోటార్లను మాయం చేస్తున్నారు. 7 హెచ్‌పీ మోటార్ ధర రూ.40 వేలపైనే ఉంటుందని రైతులు అంటున్నారు. ప్రతి సంవత్సరం ఇలా ఏదో ఓ చోట మోటార్లను ఎత్తుకెళ్తున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు అంటున్నారు. కాపర్‌కు మార్కెట్‌లో డిమాండ్ ధర ఉండటంతో మోటర్లనే లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. గతంలో బాల్కొండ మండల పరిధిలోనే నిత్యం ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్, కాపర్ చోరీకి గురైంది. ఎట్టకేలకు దుండగులను పట్టుకోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ చోరీ ఘటనలు చోటుచేసుకోలేదు. పాత ఇనుపసామాన్ దుకాణాలపై పోలీసులు నిఘాసారిస్తే మోటార్ల దొంగలు పట్టుబడతారని రైతులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి దొంగతనాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కేసీఆర్ కాలనీలో భారీ చోరీ

- 36 తులాల బంగారం, రూ.లక్ష నగదు అపహరణ

నిజామాబాద్‌రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసీఆర్ కాలనీలో దుండగులు భారీ చోరీకి పాల్పడినట్లు ట్రైయినీ ఐపీఎస్ చైతన్య రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కాలనీకి చెందిన అచ్చన్నగారి సాయిరెడ్డి వినాయక్‌నగర్‌లో నూతన ఇంటిని నిర్మించుకున్నాడు. గృహప్రవేశం పని నిమిత్తం సాయిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి కొత్త ఇంటికి వెళ్లి తిరిగి వచ్చి పడుకున్నారు. శనివారం తెల్లవారుజామున మొదటి అంతస్తులోని బెడ్ రూమ్‌కు వెళ్లగా వస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. బీరువాలోని 36 తులాల బంగారు ఆభరణాలతోపాటు రూ.లక్ష నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ట్రెయినీ ఐపీఎస్ చైతన్యరెడ్డి తెలిపారు.